ప్రజాశక్తి

శుక్రవారం 26 జనవరి 2024 8 పేజీలు






ప్రకాశం బాపట్ల

ఎన్నికల్లో ఏం చెబుతారు.?

- ఇచ్చిన హామీలు పదేళ్లుగా అమలుకు నోచుకోని దైన్యం
- 'వెలిగొండ'పై రెండు పార్టీల్లోనూ కరువైన చిత్తశుద్ధి
- తాగునీటి ప్రాజెక్టులపై తీవ్ర నిర్లక్ష్యం..
- వెంటాడుతున్న వ్యాధులు
- శాశ్వత ఉపాధి లేక కొనసాగుతున్న వలసలు..
- ఎండమావులుగా సెజ్‌లు
- సహజ వనరుల ఆధారంగా సమగ్ర ప్రణాళికలూ కరువే..



వెలిగొండ ప్రాజెక్టు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎన్నికలు రానే వస్తున్నాయి. ఐదేళ్లు గడిచాయి. రాష్ట్రం విడిపోయాక ఆరంభంలో తెలుగు దేశం.. తర్వాత వైసిపి రాష్ట్రాన్ని పాలించాయి. ఒకరు రాష్ట్రంలో రాజ ధానితో పాటు కొన్ని పరిశ్రమలు, ప్రాజెక్టులు చేపట్టగా... వైసిపి సం క్షేమ ఎజెండాతోనే ఐదేళ్లు గడిపారు. పదేళ్లలో ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పులు ఏమీ పెద్దగా లేవు. కేంద్రం ఇచ్చిన గణాంకాల్లోనూ ఇవి తేటతెల్లం చేస్తున్నాయి. పాలనావ్యవస్థల్లో మార్పులు వచ్చినా అవినీతి వంటి సంస్థాగత తప్పిదాలు కొనసాగుతూనే ఉన్నాయి. మళ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం ఈ రెండు పార్టీలన్నీ మరిచి ఓట్ల కోసం తహతహలాడుతున్నాయి. రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్రం లోని బిజెపితో లాలూచీ పడి ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. ఈ తరుణంలో జిల్లా అభివృద్ధి.. దీర్ఘకాలిక సమస్యలను ఒకసారి పరిశీలిస్తే..

ప్రకాశం జిల్లా 1972లో ఏర్పాటైంది. మూడు జిల్లాల్లో వెనుకబడిన ప్రాంతాలతో దీనిని ఏర్పాటుచేశారు. అభివృద్ధి పరంగా ఎటువంటి చర్యలూ లేవు. మళ్లీ 50 ఏళ్ల తర్వాత మూడు ముక్కలైంది. జిల్లాలో అనేక సమస్యలు ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులు ఏదీ అక్కరకు రాలేదు. వర్షాభావంతో పంటలూ సరిగా పండవు. కరువు, తాగునీటి సమస్య, వలసలు, వెనుకబాటుతనం ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. సహజ వనరుల ఆధారంగా అభివృద్ధికి ప్రణాళికలు లేవు. దీంతో ఉన్న వనరులు కూడా నిరుపయోగంగానే ఉన్నాయి.

'వెలిగొండ' ఎన్నికల ప్రచారాస్త్రమేనా?

వెలిగొండ ప్రాజెక్టుకు 2లో



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

'బూచేపల్లి' ఎన్నికల ప్రచారం ప్రారంభం

8లో



ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, అధికారులు

బుల్లెట్ కంటే బ్యాలెట్ గొప్పది..

కలెక్టర్ రంజిత్‌బాషా

7లో

ఎన్నికల్లో ఏం చెబుతారు..?

(మొదటిపేజీ తరువాయి)

1996లో శంకుస్థాపన చేశారు. 4.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 15లక్షల మందికి తాగునీరు అందించాలన్నది దీని ఉద్దేశం. 2004లో దీని పనులు మొదలయ్యాయి. ఇప్పటివరకూ రూ.5946 కోట్ల వరకూ వెచ్చించారు. రెండు సొరంగాలూ, ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. నిర్వాసితులకు ప్యాకేజీలు, పరిహారాలు, పునరావాసం పూర్తి కాలేదు. ఇందుకోసం రూ.1400 కోట్లు వరకూ అవసరమవుతాయి. బడ్జెట్‌లో కేటాయింపులపైనే ఆశలు పెట్టుకున్నారు. వీటితో పాటు గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్వహణ సరిగా లేక గేట్లు దెబ్బతిని పోయాయి. ఇప్పటికీ మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు.

ఉపాధి-పరిశ్రమలు-వలసలు

జిల్లాలో కనిగిరి, దొనకొండ వద్ద ప్రతిపాదించిన పరిశ్రమలేవీ రాలేదు. విభజన హామీల్లో వీటిని చేర్చారు. ఇక్కడ కేవలం కాగితాలకే పరిశ్రమలు పరిమితమయ్యాయి. కేవలం గ్రానైట్ పరిశ్రమల్లోనే ఉపాధి ఉంది. కనిగిరి సెజ్‌తో 30 వేల మందికి ఉపాధి వస్తుందని అంచనా వేశారు. దొనకొండ వద్ద కూడా 50 వేల మందికి పని దొరుకుతుందని భావించారు. ఇవన్నీ కలలుగానే మిగిలాయి.

పలకలు..గ్రానైట్ రంగం సంక్షోభంలోనే..

స్కిల్డ్‌వర్కర్లకు పనులు దొరికే రంగాలు గ్రానైట్, పలకలు. ఈ రెండు రంగాలూ ఇప్పుడు సంక్షోభంలో పడ్డాయి. పలకల పరిశ్రమ మూతదశకు చేరింది. గ్రానైట్ ఎగుమతులు తగ్గాయి. క్వారీలు నిర్వహించే యజమానులుగా ఉన్న రాజకీయ నేతలు తప్ప కార్మికుల జీవితాల్లో మార్పుల్లేవు. పాలిషింగు యూనిట్లు దాదాపుగా అంటే 80 శాతం నష్టాల్లో ఉన్నాయి. ఉపాధి కూడా ఈ రంగంలో రోజురోజుకూ తగ్గుతోంది. జిల్లాలో శాశ్వత ఉపాధి లేక వలస పోతూనే ఉన్నారు.

తీరప్రాంతం-పోర్టులు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 102 కిలోమీటర్ల తీరప్రాంతం ఉంది. ఇప్పటికీ ఇక్కడ ఒక్క పోర్టు గానీ, ఫిషింగు హార్బర్లు గానీ లేవు. కొత్తపట్నం వద్ద ఫిషింగు హార్బరు చేపట్టాలని నిర్ణయించారు. చీరాల, ఓడరేవు వద్ద గతంలో షిప్‌బ్రేకింగ్ యూనిట్ పెట్టాలనే ప్రతిపాదన కూడా ఉంది. ఇక్కడ పోర్టుకు అవకాశాలున్నాయి.

గిట్టుబాటు ధరల్లేక...

జిల్లాలో పొగాకు, మిర్చి, మామిడి, పత్తి, శనగ తదితర వాణిజ్య పంటలు ఎక్కువగా పండుతాయి. వీటికి గిట్టుబాటు ధరల్లేవు. పొగాకు రైతులు ఏటా ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. శనగలను నిల్వచేయడం తప్ప అమ్ముకాలు లేవు. మామిడి, సపోటా, బత్తాయి వంటి పంటలు బాగా పండుతాయి. వీటికి మార్కెట్ సౌకర్యం లేదు. పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కనీసం సౌకర్యాలు

జిల్లాలో కనీస సౌకర్యాలు మృగ్యంగానే ఉన్నాయి. ఇప్పటికీ జిల్లాలో లక్ష మందికిపైగా ఇల్లు లేనోళ్లు ఉన్నారు. ఇప్పుడు జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించారు. నిర్మాణాలు 30 శాతం కూడా కాలేదు. కారణం అన్ని రకాల నిర్మాణ సామగ్రి ధరలు పెరిగాయి. దీంతో పనులు ముందుకు సాగలేదు. ఒంగోలు నగరంలో 25 వేల మందికి ఇళ్ల స్థలాలు చాలా కాలంగా పెండింగులో ఉన్నాయి. ఇపుడు మాజీ మంత్రి బాలినేని సిఎం జగన్‌పై తీవ్ర ఒత్తిడి చేసి నిధులు తెచ్చారు. వీటిని ఎన్నికల నాటికి పంపిణీ చేసేందుకు సన్నాహాల్లో ఉన్నారు.

తాగునీటి సమస్య

జిల్లాలో వేసవి వచ్చిందంటే కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, వైపాలెం నియోజకవర్గాల్లో ట్యాంకర్లతోనే నీటిని అందించాల్సి ఉంది.కనిగిరి ప్రాంతంలో ఫ్లోరిన్ సమస్య వెంటాడుతూనే ఉంది. వేసవిలో ఏటా 500 నుంచి 800 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తుతోంది. వైపాలెం నియోజకవర్గంలో కేంద్ర సర్వే సంస్థలు పరిశోధన చేసి నీటివనరులు తీవ్ర ప్రమాదంలో ఉన్నట్లు గుర్తించాయి. అయినా ప్రత్యామ్నాయ చర్యలు లేవు.

రహదారులు అధ్వానం

జిల్లాలో జాతీయరహదారులు మినహా గ్రామీణ రహదారులు, ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. మరమ్మతులు లేవు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై వర్షపు గుంటలు కూడా పూడ్చే పరిస్థితి లేదు.

ఇసుక, గ్రావెల్, భూదందాలు..

వైసిపి ఎమ్మెల్యేలు, ద్వితీయశ్రేణి నేతలు ఇసుక, రేషన్‌బియ్యం, గ్రావెల్, భూదందాలను ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. యథేచ్ఛగా ఈ అక్రమాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలే దిగువస్థాయి నేతలకు వీటిని అప్పగించారు. అందరూ వాటాలు పంచుకుంటున్నారు. జనానికి అందాల్సినవి వారి జేబుల్లోకి చేరుతున్నాయి. భూముల ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. వివాద భూములను తక్కువకు కొనుగోలు చేసి వెంచర్లు వేస్తున్నారు. పాలకపక్షం అండతోనే ఇవన్నీ జరుగుతున్నాయి. వీటిపై ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. వాస్తవానికి జిల్లా సమగ్రాభివృద్ధికి సహజవనరుల ఆధారంగా ప్రణాళికలైతే ఇప్పటికీ కనిపించడం లేదు.



మాట్లాడుతున్న మాగుంట రాఘవరెడ్డి

సేవ చేయడమే మాగుంట కుటుంబ లక్ష్యం

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రకాశం జిల్లాకు సేవ చేయడమే మాగుంట కుటుంబ లక్ష్యమని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు, యువ పారిశ్రామికవేత్త మాగుంట రాఘవరెడ్డి అన్నారు. గురువారం నాడు శింగరాయకొండ మండలంలో ఆయన పర్యటించారు. అనంతరం సోమరాజు పల్లి గ్రామంలో మాగుంట కుటుంబం నుంచి చేస్తున్న గ్రామ అభివృద్ధి పనులను ప్రారంభించారు. పకీరుపాలెంలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. దేవస్థానంలో చైర్మన్ పామర్తి మాధవరావు ఈఓ కృష్ణవేణి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి, బెల్లం సత్యనారాయణ, రాపూరి ప్రభావతి, సామంతుల రవికుమార్‌రెడ్డి, శీలం రాము, యన్నాబత్తిన మురళి ఉన్నారు.

ఫాగింగ్ కూడా చేయడం లేదు..

నాగసత్యలత ఎదుట మహిళల ఆవేదన



నాగసత్యలతకు స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజాశక్తి-ఒంగోలు

మున్సిపాలిటీ వారు కనీసం ఫాగింగ్ కూడా చేయటం లేదని పలువురు మహిళలు దామచర్ల జనార్ధన్ సతీమణి నాగ సత్యలత ఎదుట వాపోయారు. 'నారీ కోసం నాగ సత్యలతమ్మ' కార్యక్రమం గురువారం ఒంగోలు నగరంలోని 14వ డివిజన్ రైల్వేక్వార్టర్స్ 1, 2వ లైన్లలో గల గోస్ రోడ్‌లో స్థానిక మహిళలుతో కలిసి స్థానిక సమస్యల చర్చించారు. నాగసత్యలత మాట్లాడుతూ మన ప్రభుత్వం వచ్చిన వెంటనే అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేసి నగరంలో ఎక్కడ డ్రైనేజీ సమస్యలు, దోమల సమస్యలు లేకుండా చేస్తామన్నారు. టిడ్కో ఇళ్లని వెంటనే లబ్ధిదారులకి అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక 14వ డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరీక్ష ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థుల హవా

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ లెవల్-2 పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరచి నగదు బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ విద్యార్థులను అభినందించి నగదు బహుమతులు కైవసం చేసుకున్న వేదిక్ వర్మ, కుంచాల చిన్నికృష్ణ, వరుణ్ పారుక్‌లకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డీన్ శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఏఓ మధు, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నేడు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణ పోటీలు

ప్రజాశక్తి-ఒంగోలు

స్థానిక మంగమూరు రోడ్డులోని ఫ్రీడమ్ బర్డ్ ప్లేస్కూల్‌లో చిన్నారులకు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణ పోటీలు రిపబ్లిక్‌డే సందర్భంగా శుక్రవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎన్.మాల్యాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల చిన్నారుల తల్లిదండ్రులు 9848605205 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి: జేసీ

ప్రజాశక్తి-కనిగిరి

14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని సమర్థులైన నాయకులను పాలకులుగా ఎంచుకోవాలని ఆయన సూచించారు. కనిగిరి మండలం తుమ్మగుంట పంచాయతీ నడింపల్లి గ్రామ అంగన్వాడీ కార్యకర్త కొండమ్మకు బెస్ట్ అవార్డు ప్రకటించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ పి జాన్ ఇర్విన్, మండల తహశీల్దారు ఎల్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు, సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎంపీడీవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత దేశంలో అర్హులైన ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా భారత ప్రభుత్వం జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రారంభించిందని మార్కాపురం ఉప కలెక్టర్, నియోజకవర్గ ఈఆర్ఓ రాహుల్ మీనా పేర్కొన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఉప కలెక్టర్ కార్యాలయం నుంచి బిఎల్వోలు, రెవెన్యూ, పురపాలక సంఘం సిబ్బంది, విద్యార్థులు ర్యాలీగా బయలుదేరి రీడింగ్‌రూమ్ సెంటర్, దోర్నాల బస్టాండ్, నాయుడు బజార్, మెయిన్ బజార్ మీదుగా ర్యాలీ చేపట్టారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం నథింగ్ లైక్ ఓటింగ్ ఐ ఓట్ ఫర్ ష్యూర్ నినాదాలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మున్సిపల్ కమిషనర్ డి రవీంద్ర, తహశీల్దారు డి మంజునాథరెడ్డి, ఇతర మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: ఓటు వజ్రాయుధం లాంటిలని, ఓటు హక్కును వినియోగించుకొని ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థను తీర్చిదిద్దుకుందామని యర్రగొండపాలెం నియోజవర్గ ఎన్నికల అధికారి జి సువర్ణమ్మ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు

యర్రగొండపాలెంలోని తహశీల్దారు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మాత్రమే భావప్రకటనా స్వేచ్ఛకు అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం ఉత్తమ బిఎల్వోలుగా ఎంపికైన వారికి ఆమె అవార్డులు ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో అమానుగుడిపాడు బిఎల్వో ఎం వెంకటేశ్వర్లు, కాశికుంటతండా ఎం వసుంధరాదేవి, తమ్మడపల్లి ఎన్ జీవిత, పందివానిపల్లి పి బద్దునాయక్, యర్రగొండపాలెం ఎస్ భాగ్యలక్ష్మి, వై కొత్తపల్లి ఉమ, యర్రగొండపాలెం జి పల్లవి, కె బుజ్జిబాబు, వీరభద్రాపురం నాసర్‌వలి, నర్సాయిపాలెం కె రాంబాబు, యర్రగొండపాలెం రాధాదేవి, పాలుట్ల పి నాగేశ్వరరావు నాయక్, వెంకటాద్రిపాలెం పి వెంకటేశ్వరరాజు ఉన్నారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కె రవీంద్రారెడ్డి, ఎలక్షన్ డిటి శ్రీనివాస్, ఎంఈవోలు పి ఆంజనేయులు, మల్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: మండలంలోని కంభాలపాడులో బెల్లంకొండలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని బెల్లంకొండ కాలేజీలో విద్యార్థులు అర్హత కలిగిన విద్యార్థులు ఓటర్లుగా పేరు నమోదు చేయించుకొవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు డబ్బు, ఇతర ఎంలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటర్లు ఉత్తమ నాయకులను ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని దైవసాక్షిగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేతలు విజయలక్ష్మి శ్రీనివాస్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నారపుశెట్టి నాయుడు, కాలేజీ ప్రిన్సిపాల్ తోట శ్రీనివాసులు, అధ్యాపకులు ఝాన్సీప్రియ, మెహ్రోజ్, కుమారి హమీద, దాసులయ్య, అబ్దుల్లా, కె దిబ్బారెడ్డి, సుబ్బారావు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా గురువారం పుల్లలచెరువు తహశీల్దారు కార్యాలయ ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు దాసు మాట్లాడుతూ ఓటు హక్కుపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఓటు వజ్రాయుధంలాంటి దన్నారు. దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పెద్దదోర్నాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కారుమూరి విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఓటు విలువను తెలియజేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు అందరూ నటరాజ్ కూడలిలో ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎన్ జయసింహ, జి రమేష్, హార్లీ జయరాజ్, రాజేష్, యల్లారావు, కష్ణరెడ్డి, నరసింహారావు, రమణారెడ్డి పాల్గొన్నారు.

బేస్తవారిపేట: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవడం ద్వారానే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని తహశీల్దారు డివిబి వరకుమార్ అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దారు కార్యాలయం నుంచి ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి పార్వతి, డిటి జితేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పిసిపల్లి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని పెదఇర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, గ్రామ కూడలిలో విద్యార్థుల చేత, గ్రామస్తుల చేత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అబ్దుల్ సుభాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పిసి పల్లి మండల రెవెన్యూ అధికారి కె శ్రీనివాసరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి-2 ఆర్ శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అరివేముల వీఆర్వోను సస్పెండ్ చేయాలని ధర్నా

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

అరివేముల వీఆర్వో కాశీవిశ్వేశ్వరరెడ్డి అవినీతిపై విచారణ జరిపి అతనిని సస్పెండ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి మారంరెడ్డి రత్నారెడ్డి డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న అరివేముల వీఆర్వో కాశీ విశ్వేశ్వరరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నారెడ్డి మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చిన రైతులు లంచంఇస్తే గాని వీఆర్వో కాశీవిశ్వేశ్వరరెడ్డి పని చేయటం లేదన్నారు. ఎకరాల ప్రకారం టార్గెట్ పెట్టుకొని తన వాటా తనకు ఇస్తే తాను చేయాల్సిన పని చేస్తానని, మిగిలిన వారి దగ్గరకు మీరే వెళ్లి వారితో మాట్లాడుకోండి అంటూ డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని, లంచాలు ఇచ్చిన వారికి మాత్రమే పనులు చేస్తున్నాడని ఆరోపించారు. సమస్యలపై నిలదీసిన రైతులను బెదిరిస్తున్నాడని, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోపో అనే ధోరణిలో నిర్లక్ష్య సమాధానం చెప్తున్నాడని అన్నారు. ఆర్ఐ, వీఆర్వోలు ఒకరిపై ఒకరు



డిప్యూటీ తాసిల్దార్ సలోమికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

చెప్పుకుంటూ రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రైతుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చేస్తున్న ఆర్ఐ, వీఆర్వోలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే వీఆర్వోలు మాల్యాద్రి, మనోజ్‌లు కూడా రైతుల పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దారు ఎం సలోమికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు అంకెపల్లి వెంకటేశ్వరరెడ్డి, జవ్వాజి మోహన్, యలమందల ముసలయ్య, నాగార్జునరెడ్డి, బి.నరసింహులు, ఇర్లా తిరుపతయ్య రైతులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా': చైర్మన్

ప్రజాశక్తి-కనిగిరి: క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. గురువారం కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన క్రికెట్ ఆటపోటీలు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి క్రీడలు నిర్వహించడం లేదని, మన రాష్ట్రంలోనే మట్టిలోని మాణిక్యాలను గుర్తించి వెలుగులోనికి తీసుకురావడమే సీఎం జగన్మోహన్‌రెడ్డి ముఖ్య ఆశయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ మేనేజర్ ప్రసాదు, వైసిపి నాయకులు దాసరి మురళీకృష్ణ, పిఈటిలు, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-పొదిలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక పొదిలి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం పెన్షనర్లు ధర్నా చేశారు. అపరిష్కృత సమస్యల పరిష్కారానికి రాష్ట్ర పెన్షనర్స్ సంఘం పిలుపు మేరకు నేడు పొదిలి తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరుగుతుందని పొదిలి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ బాదుల్లా, ప్రధాన కార్యదర్శి షేక్ మదార్‌వలి కోరారు. హెల్త్ కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని, మెడికల్ రీ ఇంబర్స్మెంట్ పరిధి 2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచాలని కోరారు. ఈ మేరకు తహశీల్దారు అశోక్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి పెన్షనర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు పెన్షనర్ల సమస్యలు సిఫార్సు చేస్తానని తెలిపిన తహశీల్దారు అశోక్ కుమార్ రెడ్డి వివరించారు.

వైసిపి విజయమే లక్ష్యంగా కృషి: దద్దాల

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ గురువారం కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మాజీ ఎంపీపీ పోతు కొండారెడ్డిలతో పాటు పలువురు వైసీపీ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి నారాయణ యాదవ్‌ను వారు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా దద్దాల



మున్సిపల్ చైర్మన్ గఫార్‌ను కలిసిన వైసిపి ఇన్‌ఛార్జి దద్దాల

మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా అందరం ఐక్యంగా కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కనిగిరి జెడ్పిటిసి మడతల కస్తూరిరెడ్డి, వైసీపీ నాయకులు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మోలే గోపాల్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, సిద్ధారెడ్డి, కటికల వెంకటరత్నం, బత్తుల మాలి, పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై లారీ బోల్తా

ప్రజాశక్తి-పంగులూరు

జాతీయ రహదారిపై వెళుతున్న తారు లారీ అదుపుతప్పి, ఫ్లై ఓవర్‌పై అడ్డంగా పడిపోయిన సంఘటన గురువారం ఉదయం మండలంలోని ముప్పవరం ఫ్లైఓవర్‌పై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, విజయవాడ వైపు నుంచి, నెల్లూరు వైపు వెళ్తున్న తారు లారీ ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో ముప్పవరం ఫ్లైఓవర్ మీద అదుపు తప్పి, గుంటూరు వైపు వెళ్లే హైవే రోడ్డుపై తిరగబడింది. దీంతో గుంటూరు వైపు వెళ్లే వాహనాలకు అంతరాయం కలగడంతో, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా సర్వీస్ రోడ్డు వైపు మరలించారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌గా ఉన్న తమిళనాడు రాష్ట్ర తిరునల్ వెల్లి జిల్లా, సితారం కొండన్ మండలం, నాయుడు తీరు గ్రామానికి చెందిన ఇనాసి ముత్తుకు గాయాలు కావడంతో అతనిని నేషనల్ హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రేణింగవరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుడిమెట్ట చెరువులో కొండచిలువ

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం గుడిమెట్ట గ్రామ చెరువులో కొండచిలువ కలకలం రేపింది. చెరువులోని చేపలను తింటూ జీవిస్తున్న కొండచిలువ చెరువులో నీళ్ల తగ్గేసరికి బయటపడి ఉండొచ్చని గ్రామ ప్రజలు చెప్పుకుంటున్నారు. అటవీశాఖ అధికారులకు సమచారం ఇవ్వడంతో వారు కొండచిలువను అక్కడి నుంచి అటవీ ప్రాంతానికి తరలించారు.

సాధికార సారథులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ

ప్రజాశక్తి-కొమరోలు

కోమరోలు మండల క్లస్టర్ పరిధిలోని యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, కుటుంబ సాధికార సారథులకు ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు టిడిపి కొమరోలు మండల అధ్యక్షులు బోనేని వేంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాలను స్థానిక మాజీ ఎంపీటీసీ ముత్తుముల సంజీవరెడ్డి గృహ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున అందరూ అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఎండియు ఆపరేటర్ల సమస్యలు తీర్చండి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలంలో ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం ఇంటింటికీ వెళ్లి ఇస్తున్న ఎండియు ఆపరేటర్ల సమస్యలను తీర్చాలంటూ గురువారం హనుమంతునిపాడు తహశీల్దారు పుల్లారావుకు మండల ఎండియు ఆపరేటర్ల అసోసియేషన్ సభ్యుడు గంట మల్లికార్జున వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ రెండు వేలిముద్రల కారణంగా పని భారం పెరిగి హెల్పర్లు రావడం లేదని అన్నారు. ఇప్పటికైనా రెండు వేలి ముద్రల వ్యవస్థ తొలగించి ఒకే వేలిముద్రతో నిత్యవసర సరుకులు అందేలా చూడాలని కోరారు. అంగన్వాడీ, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన కమీషన్ డబ్బులు డీలర్లకు రూపాయి 50 పైసలు చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఫిబ్రవరి నెల నుంచి పూర్తిగా సరుకులను ఆపేస్తామని వారు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి ఎండియూ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల ఎండియు ఆపరేటర్లు పాల్గొన్నారు.

కాలువలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

ప్రమాదవశాత్తు కాలువలో పడి యువకుడు మతి చెందిన సంఘటన మండలంలోని పెద్ద అంబడపూడి బీసీ కాలనీకి చెందిన గుంటుపల్లి ఈశ్వర్(33) సంవత్సరాలు గురువారం చోటు చేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల మేరకు మతుడు ఈశ్వర్ అంబడపూడి నుండి కొమ్మినేని వారి పాలెం వెళ్లి మార్గంలో పొలం పనులు చూసుకుని మరల తిరిగి వచ్చే సమయంలో అంబడిపూడి గ్రామ శివారు సమీపంలో రోడ్డు పక్కన ఉన్న పంట కాలవల్లో మోటర్ సైకిల్ అదుపుతప్పి ప్రమాదవశాత్తు పడి మతి చెందాడని తెలిపారు. దీనితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుము కొన్నాయి.



రాజ్యాంగ పీఠిక పుస్తకాన్ని పరిచయం చేస్తున్న దృశ్యం

బాలల కోసం రాజ్యాంగ పీఠిక

ప్రజాశక్తి - పంగులూరు

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు విద్యార్థులు రాజ్యాంగ పీఠికను తెలుసుకోవాలని, రాజ్యాంగ విభాగాలను బొమ్మల రూపంలో చూపిస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలియజేసే పుస్తకం బాలల కోసం రాజ్యాంగ పీఠిక పుస్తకాన్ని గురువారం పంగులూరు, చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ పుస్తకాన్ని చదవటం ద్వారా రాజ్యాంగాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి తంగా శ్రీనివాసరావు అన్నారు. గంగవరం బాలల సైన్స్ వేదిక ఈ పుస్తకాన్ని అందిస్తుందని చెప్పారు. బాలల విజ్ఞానాన్ని మరింత పెంపొందించేందుకు కావలసిన అనేక అంశాలు ఇందులో ఉన్నాయని యుటిఎఫ్ మండల అధ్యక్షులు టివి నరసింహారావు అన్నారు. ఈ పుస్తకాలను 10వ తరగతి విద్యార్థులందరికీ అందజేశారు. కార్యక్రమంలో పంగులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కొప్పోలు రమాదేవి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు డి శాంతి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో వైసిపి ఇన్‌ఛార్జి హనిమిరెడ్డి

వాలంటరీ వ్యవస్థను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - అద్దంకి

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండి ప్రజలకు అత్యుత్తమ సేవలందిస్తున్న వాలంటరీ వ్యవస్థను కాపాడుకోవడానికి ప్రతి వాలంటీరు సిద్ధంగా ఉండాలని వైసిపి ఇన్చార్జ్ పానెం హనిమిరెడ్డి అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో అద్దంకి మండలం, పురపాలక సంఘం పరిధిలోని వాలంటీర్లతో ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంతో పాటు అర్హులైన ప్రతి లబ్ధిదారుని గుర్తించడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషించారని ఆయన అన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని అత్యున్నత వ్యవస్థ వాలంటీర్ వ్యవస్థని వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసి ప్రజలలో అత్యుత్తమ గుర్తింపును తీసుకొచ్చారన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధుల కంటే వాలంటీర్ వ్యవస్థకి అత్యుత్తమ గుర్తింపు లభించిందని, జగన్మోహన్ రెడ్డి పరిపాలనకు రథసారథులు వాలంటీర్ల వ్యవస్థని కొనియాడారు. టిడిపి అధికారంలోకి వస్తే వాలంటరీ వ్యవస్థను తీసి వేస్తామని చెప్తున్నారని అనినారు. దీనిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని వాళ్ళింటికి వచ్చే వ్యవస్థను కాపాడుకునేలా తిరిగి జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లతోపాటు ఆ గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కిసాన్‌మోర్చా ర్యాలీ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక ఆదర్శ హైస్కూలు నుండి ట్రాక్టర్లు, మోటారు సైకిళ్ళ ర్యాలి శుక్రవారం జరుగుతుందని రైతు సంఘం నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు గురువారం తెలిపారు. 13మాసాలు ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకపోవటాన్ని నిరశిస్తూ దేశవ్యాప్తంగా 540రైతు సంఘాలు శుక్రవారం ర్యాలిలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆదర్శ హైస్కూలు నుండి ర్యాలీ ప్రారంభం అవుతుందని తెలిపారు. రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాల భద్రత పటిష్టంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. ఆచార్య ఎన్‌జి రంగ విశ్వవిద్యాలయంలోని కళాశాల భవనాన్ని ఎస్పీతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఎన్నికల మార్గదర్శకాలను అనుసరించి స్ట్రాంగ్ రూమ్‌లు ఉండాలన్నారు. ఈవీఎం యంత్రాలకు పటిష్ట భద్రత కల్పించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రం సమీపంలోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాపట్ల జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు 24హాల్స్ ఉండాలని సూచించారు. ఎన్నికల ముందు, తదుపరి ఈవిఎం యంత్రాల తరలింపు, స్ట్రాంగ్ రూములకు చేర్చడంపై ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఆయన వెంట అదనపు ఎస్పీ పి మహేష్, డిఆర్‌ఒ పి వెంకటరమణ, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఒలు జి రవీందర్, పి సరోజిని, హేలా షారోన్, వ్యవసాయ కళాశాల డీన్, ప్రధానాచార్యులు శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కష్ణకాంత్ పాల్గొన్నారు.



ఓట్ల లెక్కింపు కేంద్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

డిఎస్సీ సాధనకు 36 గంటల దీక్ష

డివైఎఫ్‌ఐ నాయకులు కెవి లక్ష్మణరావు

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని డివైఎఫ్‌ఐ నాయకులు కెవి లక్ష్మణరావు అన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి ఉపాధి కలిగేదని అన్నారు. కానీ ఉక్కు పరిశ్రమ శంకుస్థాపనకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం పరిమితమైందని అన్నారు. గత ఎన్నికల ప్రచారంలో పాదయాత్ర చేస్తూ మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్ల అవుతుందని అన్నారు. నోటిఫికేషన్ విడుదల చేయకుండా మోసం చేశారని అన్నారు. ఈ రాష్ట్రంలో ఆరు లక్షల మంది డిఎస్‌సి అభ్యర్థులు అద్దె గదులలో నివాసం ఉంటూ వేలకు వేలు ఖర్చు పెట్టి కోచింగ్ సెంటర్లో కోచింగ్ తీసుకుంటున్నారని అన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, నిరుద్యోగ సంఘాలు ఆందోళన చేస్తుంటే ఇదిగో పులి - అదిగో మేక, అనే పద్ధతిలో ఇదిగో ఇస్తున్నాం - అదిగో ఇస్తున్నామని ప్రకటనలు ఇచ్చి కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇదే పద్దతిలో కొనసాగితే రాబోయే ఎన్నికల్లో నిరుద్యోగులు బుద్ధి చెప్తారని అన్నారు. డీఎస్సీ సాధనకోసం డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 27, 28తేదీల్లో విజయవాడలో 36గంటల దీక్ష జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం 25వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరుద్యోగుల ఆందోళన మరింత ఉధృతంగా కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ నాయకులు ఎన్ శివశంకర్, ఎం సూర్య ప్రకాష్, మరియదాసు పాల్గొన్నాం



సమావేశంలో డివైఎఫ్‌ఐ నాయకులు కెవి లక్ష్మణరావు

గ్రామీణ అభివృద్ధే వైసీపీ లక్ష్యం

- రూ.43 లక్షలతో సచివాలయం ప్రారంభోత్సవం
- రూ.2కోట్ల తో నూతన సీసీ రోడ్డు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - చీరాల

ప్రజల అభివృద్ధి లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని, అందులో భాగంగా అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో రూ.43లక్షలతో నూతనగా నిర్మించిన సచివాలయ భవనం, రూ.2కోట్లతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు వైసిపి ఇంచార్జీ కరణం వెంకటేష్‌తో కలిసి ప్రారంభించారు. సచివాల వ్యవస్థ ద్వారా అన్ని రకాల సేవలు ప్రజలకు చేరువ అవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, పిఎసిఎస్ చైర్మన్ బోయిన కేశవులు, వైసిపి జిల్లా కార్యదర్శి బండారు శివపార్వతి, మండల మాజీ ఉపాధ్యక్షులు నాదెండ్ల కోటేశ్వరరావు, బిట్రా శ్రీనివాసరావు, కోటి రవి, చప్పిడి రామచంద్ర, మాజీ ఎంపిటిసి పృథ్వి ధనంజయ, శీలం వేంకటేశ్వరమ్మ, వాడరేవు మాజీ సర్పంచి ఎరిపిల్లి రమణ, పర్వతనేని శ్రీనివాసరావు, ఆవుల కొండలు, గుమ్మడి చిన్నబాబు, బక్క అద్దంకిరెడ్డి, షేక్ మస్తాన్, పంచాయతీరాజ్ డిఇ శేషయ్య పాల్గొన్నారు.



సచివాలయ భవనం ప్రారంబిస్తున్న కరణం వెంకటేష్

ఆత్మీయుల సమావేశంలో 'దారపనేని'

ప్రజాశక్తి - పామూరు

మండలంలోని తూర్పు కోడిగుడ్లపాడు పంచాయతీ పరిధిలోని పోతవరం, జంగాల పల్లె గ్రామాల నుండి వివిధ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆత్మీయుల సమావేశంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారందరూ ఆయనతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆయన నిర్ణయంపైనే మేమంతా నడుచుకుం టామని అన్నారు. తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీలు చెనికల పెద్దమాల కొండయ్య, చెనికల వెంగమ్మ, డబ్బుకొట్టు ఆదిలక్ష్మమ్మ కుటుంబ సభ్యులు, మాజీ సర్పంచ్ మానం గురువయ్య యాదవ్ కుటుంబ సభ్యులు, చెనికల చినమాల కొండయ్య, చెనికల మాల కొండయ్య (పెద్దాయన), చెనికల నాగేశ్వరరావు, మానం మల్లికార్జునరావు అండ్ బ్రదర్స్, బొడ్డు సుధాకర్ అండ్ బ్రదర్స్, మానం వెంగళరావు (రెడ్డి), చెనికల వెంకటేశ్వరరావు (బచ్చు), చెనికల మనోజ్, నాగార్జున, రమణ, ఆవులయ్య, ఆవులయ్య మాట్లాడారు.



ఆత్మీయ సమావేశంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ దారపనేని



నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన క్రికెట్ టీం

హోరాహోరీగా ఆటలు

ప్రజాశక్తి - శింగరాయకొండ

శింగరాయకొండ హైస్కూల్లో జరుగుతున్న కొండేపి నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు ఎంతో ఆసక్తికరంగా జరుగుతున్నాయని ఆడదాం ఆంధ్ర కోఆర్డినేటర్ టి అశోక్ బాబు గురువారం తెలిపారు. గురువారం జరిగిన ఆటలు పోటీల్లో కోకోలో పోటీలలో ఫైనల్స్‌కి జరుగుమల్లి మండలం, మరిపూడి మండలాల బాల, బాలికల రెండు జట్లు చేరాయని తెలిపారు. క్రికెట్ మ్యాచ్‌లో శింగరాయకొండ వర్సెస్ మర్రిపూడి తలపడగా శింగరాయకొండ విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లన్నీ గెలిచిన విజేతలకు 29న బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయులు టి అశోక్ బాబు, ఎన్‌టి ప్రసాద్, మాల్యాద్రి, జంషీర్, రవికిరణ్, మురళి, హజరత్తయ్య, వెంకట్రావు, శ్రీను, లావణ్య న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



రామకూరులో పల్లె పల్లెకు హనిమిరెడ్డి

వైసిపి జెండా ఎగరవేయాలి

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని రామకూరు గ్రామంలో "పల్లె పల్లెకు హనిమిరెడ్డి" కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహించారు. వైసిపీ ఇంఛార్జి పానెం చిన్న హనిమిరెడ్డి గ్రామానికి విచ్చేశారు. ఆయనకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. డాక్టర్ వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. గ్రామంలో ర్యాలీగా వెళ్తూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి మద్దతు ఇచ్చి అఖండ మెజార్టీతో గెలిపించి వైసిపి జెండా ఎగిరేల చేయాలని కోరారు.



క్రీడాకారులతో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు

ముగిసిన క్రీడలు

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడలు గురువారంతో ముగిసాయి. క్రీడా పోటీలు స్థానిక ఎన్‌ఆర్‌అండ్‌పిఎం బాలుర హైస్కూల్ ప్రాంగణంలో ఆర్‌డిఒ పి సరోజిని అధ్వర్యంలో ఈ నెల 24, 25తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని చీరాల పట్టణం, రూరల్, వేటపాలెం మండలం నుండి క్రికెట్, వాలీబాల్, బ్యాట్మంటిన్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కె రామచంద్రారెడ్డి, ఎంపిడిఒ కె నేతాజీ, పిఇటిలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

స్థానికంగా నిర్మాణంలో ఉన్న భవన సముదాయంలో పేకాట ఆడుతున్న 9మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వై సురేష్ తెలిపారు. వీరి నుండి రూ.40300నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని రేపల్లె కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. జూదం ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే..

'రెండో సొరంగం పూర్తి' ఆలాపన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగం పూర్తయిందని, అపర భగీరథుడు ముఖ్యమంత్రి అని పాట పాడటం ప్రజలను మభ్యపెట్టేందుకేనని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దగ్గుపాటి సోమయ్య విమర్శించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మార్కాపురం పట్టణ కమిటీ సమావేశం నాయకులు పందిటి రూబేన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దగ్గుపాటి సోమయ్య మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకొస్తే సంవత్సరంలోనే పూర్తిచేసి నీరు ఇస్తామని, 2022 సెప్టెంబర్‌కు పూర్తి చేస్తామని, 2023 అక్టోబర్‌కు పూర్తి చేసిన అనంతరమే ఎన్నికల్లో ఓట్ల కోసం వస్తామని, 2023 డిసెంబర్‌కు పూర్తి చేస్తామని, 2024 ఫిబ్రవరిలో జాతికి అంకితం చేస్తామని అంటూ వైసిపి ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుంచి మాయమాటలు చెబుతూ, తేదీలు మారుస్తూ, ప్రజలను మభ్యపెడుతోందని ఎద్దేవా చేశారు. రెండో సొరంగం మాన్యువల్‌గా తవ్వడం మాత్రమే పూర్తయిందని, లైనింగ్ పనులు అట్లానే మిగిలిఉన్నాయని తెలిపారు. మొదటి సొరంగం నుంచి రెండో సొరంగంలోకి తవ్విన మూడు రంధ్రాలు పూడ్చాల్సి ఉందన్నారు. మొదటి సొరంగం అడుగు భాగాన మూడు అడుగుల మేర ఉన్న గ్రావెల్‌ను తొలగించవలసి పని ఉందని, నల్లమల్ల సాగర్‌లోకి నీరును తీసుకుని వెళ్లే ఫీడర్ కెనాల్ పనులు ఇంకా చాలా అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. ఇన్ని విధాలుగా ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా ఉంటే, ప్రాజెక్టు పూర్తయింది అని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడం కాక ఏమవుతుందని వారు ప్రశ్నించారు. వెలిగొండ ముంపు గ్రామాల ప్రజలకు చెల్లించవలసిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పరిహారం వెంటనే చెల్లించి, పునరావాస కాలనీలను పూర్తిచేసి నిర్వాసితులందరినీ బయటకు తరలించినప్పుడు మాత్రమే వెలుగొండ పూర్తయిందని భావించవలసి ఉంటుందన్నారు. వెంటనే నిర్వాసితులందరికీ పరిహారం చెల్లించి, నిర్వాసిత గ్రామాలలోకి తరలించాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డికెఎం రఫీ, సిపిఎం మార్కాపురం పట్టణ నాయకులు షేక్ నన్నేసా, జవ్వాజి రాజు, బలుసుపాటి కాశయ్య, దర్శి శారా, గుంటూరు కొండయ్య, ఎస్‌కె కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి సోమయ్య

ఏఎంసీ చైర్మన్‌గా డాక్టర్ షంషీర్ అలీబేగ్



ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ ఎం షంషీర్ అలీబేగ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గురు వారం సాయంత్రం ఆయనకు అధికారికంగా ఉత్తర్వులు అందాయి. వైస్ చైర్మన్‌గా పొనుగంటి మురళి నియమితులయ్యారు. ఏఎంసి కమిటీ గౌరవ చైర్మన్‌గా కెపి నాగార్జునరెడ్డి, డైరెక్టర్లుగా డాక్టర్ ఎస్‌కె మక్బూల్‌బాషా, పిఎల్‌పి యాదవ్, ఐ శారద, టి ఆంజనేయులు, పేరూరి లక్ష్మీదేవి, ఎస్‌కె నూర్జహాన్, ఓర్సు పాటెమ్మ, వేశపోగు రాజు, కే వసంతకుమారి, శ్రీరామ్ అంకమ్మ, చెక్క సత్యనారాయణ, ఊటుకూరు సురేష్, కె రమాదేవి, పిఎసి ఎస్ చైర్మన్, జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, మున్సిపల్ చైర్ పర్సన్‌లు నియమితుల య్యారు. డాక్టర్ అలీబేగ్ ఏ వన్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్‌గాను, అలాగే వైసిపి రాష్ట్ర సెక్రెటరీగా వ్యవహరిస్తున్నారు. ఈయన వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కీలకంగా పనిచేస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ షంషీర్ అలీబేగ్ మాట్లాడుతూ తనకు ఏఎంసి చైర్మన్‌గా అవకాశం కల్పించిన గౌరవ శాసనసభ్యులు కెపి నాగార్జునరెడ్డికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, పార్టీ ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపిలోకి కొనసాగుతున్న వలసలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మండలం తుమ్మగుంట గ్రామానికి చెందిన 31 కుటుంబాలు వైసిపీని వీడి టిడిపిలో చేరాయి. కనిగిరి టిడిపి కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలను నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈర్ల వెంకటేశ్వర్లు, ఈర్ల శ్రీను, ఇంధ్ర బాలకృష్ణ, గోగు ఆంజనేయులు, చెన్నకేశవులు, రంగయ్య, చిన్నయ్య, గురప్పడు, బ్రహ్మయ్య, నాగయ్య, సుబ్బయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

తహశీల్దారు సీతారామయ్యకు బెస్ట్ అవార్డు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండల తహశీల్దారు డి సీతారామయ్య గిద్దలూరు మండలంలో ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలతో ఓటర్ల జాబితా పై తగు రీతిలో చర్చలు సమావేశాలు నిర్వహించటం, రిపోర్టు లు తయారీ, కొత్త ఓటర్ల నమోదు, ఇంటింటికీ తిరిగి మార్పులు చేర్పులతో 98.7 శాతం ఓటర్ల జాబితా రూపకల్పన చేయటంలో ప్రతిభ కనబరిచిన గిద్దలూరు తహశీల్దారు డి సీతారామయ్యకు ప్రభుత్వం బెస్ట్ ఎలక్ట్రోల్ ప్రాక్టీస్ (ఏఈఆర్) అవార్డు ఇచ్చి సత్కరించింది. ఈ సందర్భంగా గురువారం నాడు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, తహశీల్దారు డి సీతారామయ్యకు బెస్ట్ అవార్డు అందజేసి సత్కరించారు. జిల్లా అధికారులు, గిద్దలూరు మండల స్థాయి అధికారులు, ప్రజలు ఆయనకు అభినందనలు తెలియజేశారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో అవార్డు పొందుతున్న తహశీల్దారు సీతారామయ్య

మాజీ విద్యా కమిటీ చైర్మన్ మృతి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల కేంద్రం కొనకనమిట్ల ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాల మాజీ విద్యా కమిటీ చైర్మన్ సుంజల బాలకోటయ్య అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం బాలకోటయ్య మృతదేహాన్ని ఎంపిటీసీ కల్లం సుబ్బమ్మ దిబ్బారెడ్డి, మాజీ ఎంపిటిసి పిల్లి లక్ష్మీనరసయ్య, ఆది ఆంధ్ర పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాయం కాశిరెడ్డి, ఏపీటీఎఫ్ మండల మాజీ అధ్యక్షులు మంచికల కోటేశ్వరరావు, కేజీ మస్తాన్‌లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల జెవివి అధ్యక్ష ఉపాధ్యక్షులు పీవీ కొండయ్య, పి బాలనరసయ్య, నాయకులు వెంకటేశ్వర్లు, మండల మాజీ ఎస్సీ సెల్ నాయకులు పందిటి ఏసేబు, టైలర్ సంఘం అధ్యక్షులు పి చిన్న, జి నరసయ్య, వెలుగొండయ్య పాల్గొన్నారు.


బాలకోటయ్య (ఫైల్)

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

ప్రజాశక్తి-సింగరాయకొండ

కొండపి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త పనిచేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ (సత్య) పిలుపునిచ్చారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు జరుగుమల్లి మండలంలో ఆయన పర్యటించారు. నందనవనం, బిట్రగుంట, చిలుకూరు పాడు చింతలపాలెం కామేపల్లి వరకు ఆయన గ్రామగ్రామాన పర్యటించి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో గ్రామాల్లో సమావేశమై ఎన్నికల నోటిఫికేషన్ రానుందని తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్త గ్రామాల్లో కొండెపి శాసనసభ్యులుగా డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. తెలుగుదేశం జనసేన పొత్తుతో తెలుగుదేశం పార్టీని విజయం ఢంకా మోగించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు భారీగా హాజరయ్యారు.


నాయకులతో మాట్లాడుతున్న దామచర్ల సత్య

టిడిపిలోనే బిసిలకు ప్రాధాన్యం

ప్రజాశక్తి-కురిచేడు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే బిసిలకు అత్యధిక ప్రాధాన్యత లభించిం దని, అలాంటి ప్రాధాన్యత మళ్లీ కావాలంటే టిడిపిని అధికారం లోకి తేవాల్సిఉందని, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధికార ప్రతినిధి శానాల వీరబ్రహ్మం అన్నారు. గురువారం స్థానిక పోలేరమ్మ గుడివద్ద జరిగిన టిడిపి జయహో బిసి సభలో ఆయన ప్రసంగించారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ చేసిన అభివృద్ధి ఏమీలేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పథకాలను తీసివేశారని అన్నారు. రాష్ట్రంలో 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు ఇవ్వకుండా బిసిలను మోసం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని అన్నారు. రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించుకొని చంద్రబాబుని ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పిడతల నెమలయ్య, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు మోడి వెంకటేశ్వర్లు, డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ సునీల్, బిసి నాయకులు బొనిగల అంకయ్య, పిక్కిలి చెన్నయ్య, మర్రి సుబ్బారావు, పూల శ్రీను, తాటిమట్ల వెంకటేశ్వర్లు, ఆలా గోవిందు, పామిశెట్టి వేమయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న టిడిపి నాయకులు

సురేష్‌బాబుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లోని ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ జోనల్ స్థాయి పోటీలు జరుగుతున్న సందర్భంగా ఈ పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వాసవీ క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు కొంజేటి వెంకటసురేష్‌బాబును స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధి విఎన్ ప్రసాదరావు, వాసవీ క్లబ్ అధ్యక్షులు వేమూరి శేషారావు, మహిళా క్లబ్ కార్యదర్శి చలువాది చంద్రావతి, వాసవీ క్లబ్ కార్యదర్శి చలువాది రాము, మాజీ అధ్యక్షులు బదరీనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ గ్రంధి పాండురంగారావు, వాసవీ క్లబ్ ప్రతినిధులు పాదర్తి గిరి, పబ్బిశెట్టి ఆంజనేయులు, ఎంఈఓ వెంకారెడ్డి, హైస్కూల్ హెచ్ఎం పి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సిట్ వేసి భూ ఆక్రమణలపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరిలో జరుగుతున్న భూ ఆక్రమణలపై సిట్ వేసి విచారణ జరిపి ఆక్రమణదారులపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పిసి కేశవరావు డిమాండ్ చేశారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ కాలనీ సమీపంలో సర్వే నెంబర్ 29లోని 4.60 ఎకరాల స్థలంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను గురువారం అడ్డుకున్నారు. భూ ఆక్రమణలపై తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెలిప్యాడ్ స్థలాన్ని కేతినేని తిరుపతయ్య ఆక్రమించుకొని నకిలీ పట్టాలు సృష్టించి విక్రయాలు చేపడుతున్న, అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అధికారులకు పట్టలేదని విమర్శించారు. శంఖవరం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 194-2లో నాగుల చెరువు కొండవాగును ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారని, అదేవిధంగా ఒంగోలు మార్గంలోని సూరా పాపిరెడ్డి నగర్‌లో వాగు పోరంబోకు భూమిని ఏఎంసి సిబ్బంది బెంజిమెన్ అతని సోదరులు ఆక్రమించి విక్రయాలు చేపడుతున్న అధికారులకు చలనం లేదని విమర్శించారు. అదేవిధంగా పేదలకు పంపిణీ చేసిన భూములను సైతం ఆక్రమణదారులు ఆక్రమించుకుంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, ఫలితంగా వారు భూములను కోల్పోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అసైన్మెంట్ భూములలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేస్తూ విక్రయాలకు పాల్పడటం వలన అమాయక ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసి నష్టపోతున్నారని అన్నారు. ఈపాటికే జిల్లా అధికారులను కలిసి ఆక్రమాలపై చర్యలు చేపట్టాలని వినతి పత్రాలు సమర్పించడం జరిగిందని పేర్కొన్నారు. భూ ఆక్రమాలపై చర్యలు చేపట్టకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె బషీర, వి కాశయ్య, పి నరేంద్ర, ఎన్ రవణమ్మ, ఆర్ ఏడుకొండలు పాల్గొన్నారు.


తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

ద్వితీయ స్థానం సాధించిన డైట్ విద్యార్థులు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఆడుదాం ఆంధ్రలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో స్థానిక హైస్కూలులోని ఇండోర్ స్టేడియంలో గురువారం షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు జరిగింది. మైనంపాడు డైట్ విద్యార్థులు ఎస్ యశోద, ఏ లావణ్య పాల్గొని నియోజకవర్గం స్థాయిలో ద్వితీయ స్థానం పొందినట్లు డైట్ ప్రిన్సిపాల్ అత్తోట కిరణ్‌కుమార్ తెలిపారు. వీరికి కోచింగ్ ఇచ్చిన పీఈటి టి రవికుమార్‌ను అభినందించారు. చదువులతోపాటు ఆటల్లో కూడా డైట్ విద్యార్థులు ప్రతిభ కనపరచటం సంతోషకరమైన విషయమని అన్నారు. డైట్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శి డి వెంకట్రావు గెలుపొందిన క్రీడాకారిణిలను అభినందించారు.



గంటావానిపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని గంటావానిపల్లి గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం పని అయిపోయిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా టిడిపిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. టిడిపి మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఇంటింటికీ తిరిగి ష్యూరిటీ బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, దొడ్డా శేషాద్రి, మాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో శ్మశానవాటిక


శ్మ శాన వాటిక ముఖద్వారం


తుప్పు పడుతున్న విద్యుత్ శవదహన పరికరాలు

ప్రజాశక్తి బాపట్ల

పట్టణంలోని రైలుపేట హిందూశ్మశాన వాటిక అభివృద్ధి ఆమడ దూరంలో ఉంది. హిందూ శ్మశాన వాటికల్లో రైలుపేట హిందూ శ్మశాన వాటిక ప్రధానమైంది. పట్టణం లోని 34వార్డుల్లో హిందువుల్లో మరణించిన వారి అంత్య క్రియలు ఈ స్మశాన వాటికలోని నిర్వహిస్తారు. ప్రాధాన్యత గల రైలుపేట హిందూ స్మశాన వాటిక అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించడం లేదు. స్మశానంలో శవదహన షెడ్డుపై రేకులు పగిలిపోయి దర్శనమి స్తున్నాయి. ఎంఎల్ఎ కోన రఘుపతి సూచనల మేరకు స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేశారు. ప్రజల భాగస్వామ్యంతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50కోట్లతో విద్యుత్తు శవ దహనానికి అవసరమైన భవన సము దాయం, శవ దహనానికి అవసరమైన విద్యుత్తు పరికరాల సదుపాయాల కల్పించనున్నారు. టెండర్ ప్రక్రియ ద్వారా స్మశాన వాటికలో విద్యుత్ శవదహనానికి అవసరమైన భవన నిర్మాణంతో పాటు విద్యుత్ పరికరాలు నిర్మాణానికి పనులను ఓ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిం చారు. ఇందుకోసం చేపట్టిన భవన నిర్మాణం పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. విద్యుత్ సవదహనానికి అమర్చేందుకు తెచ్చిన ఇనుప గొట్టాలు తుప్పు పడుతున్నాయి. వాతావరణ కాలుష్య దృష్ట్యా విద్యుత్ శవాదహ నానికి చేపట్టిన పనులు మధ్యలో ఆగిపోవడం పట్ల వీటిని పట్టించుకోలేదు లేదనే విమర్శిస్తున్నారు. ఈ పనులకు మంజూరైన నిధుల్లో రూ.50లక్షలు విడుదలయ్యాయి. ఆ మొత్తంతో పనులు చేపట్టిన కాంట్రాక్టరు పనులు ప్రారంభంలోనే వదిలేశారు. తిరిగి పనులు ప్రారంభించడానికి తమ వద్ద నిధులు లేవని తిరిగి నిధులు మంజూరు చేస్తే పనులు చేపడతానని కాంట్రాక్టరు చెబుతున్నట్లు తెలుస్తోంది.

పనులు ప్రారంభించే ఏర్పాటు చేస్తాం
కమిషనర్ భాను ప్రతాప్

ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ భాను ప్రసాద్ వివరణ కోరగా పట్టణంలోని రైలుపేట హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి ఎంఎల్ఎ కోన రఘుపతి సహకారంతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. భవన నిర్మాణం, విద్యుత్ పరికరాలకు రూ.50లక్షలు ప్రాథమికంగా మంజూరైనట్లు తెలిపారు. ఓ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారని తెలిపారు. పనులు పూర్తయితే మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తామని కాంట్రాక్టు నోటీసు ఇచ్చామని తెలిపారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టడం లేదన్నారు. దీనిపై కమిటీతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకొని తిరిగి ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి స్థాయిలో విద్యుత్ శవాదహనానికి అవసరమైన రీతిలో రైలుపేట హిందూ స్మశాన వాటికను ఆధునికరిస్తామన్నారు.


అంకమ్మతల్లి గుడికి శంకుస్థాపన చేస్తున్న హనిమిరెడ్డి

అంకమ్మ తల్లి గుడికి శంకుస్థాపన

ప్రజాశక్తి - సంతమాగులూరు

రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుతున్నారని వైసిపి ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి తెలిపారు. మండలంలోని కొప్పరం గ్రామంలో వడియ రాజులు నూతనంగా నిర్మిస్తున్న అంకమ్మ తల్లి గుడికి ఆయన శంకుస్థాపన గురువారం చేశారు. అనంతరం ముస్లిం కాలనీలో నూతనంగా నిర్మించిన మసీదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొప్పరం గ్రామ ప్రజలు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాబోయే ఎన్నికలలో అద్దంకితో పాటు రాష్ట్రమంతటా వైసిపి ప్రభంజనం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు ప్రతిపక్షాల కుట్రలను, మోసపూరిత మాటలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, వైసీపీ మండల కన్వీనర్ చింతా రామారావు, సంతమాగులూరు ఎఎంసి వైస్ చైర్మన్ విప్పల ముసలారెడ్డి, ఓరుగంటి కోటిరెడ్డి, బండి వెంకటరెడ్డి, గుంజి లక్ష్మయ్య, సర్పంచి అంగడి కోటేశ్వరమ్మ, తమ్మిశెట్టి గోపి, వల్లెపు గరటయ్య పాల్గొన్నారు.


ప్రాంగణ ఎంపికకు ఎంపికైన ఫార్మశీ విద్యార్థులు

కిమ్స్ హాస్పిటల్‌కు 10 మంది ఎంపిక

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

స్థానిక డిసిఆర్‌ఎం ఫార్మశీ కళాశాలకు చెందిన 10మంది విద్యార్థులు కిమ్స్ హాస్పిటల్ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ వేణు తెలిపారు. కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం గురువారం కళాశాల ఆవరణలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారన్నారు. ఎంపికల్లో 10మంది విద్యార్థులు ఎంపిక కవాటం పట్ల విద్యార్థులను, అధ్యాపకులను డిసిఆర్‌ఎం విద్యాసంస్థల డైరెక్టర్ చిలుకూరి శ్రీధరరావు అభినందించారు.


శింగరకొండ ఆంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

శింగరకొండలో లక్ష బిల్వార్చన

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండ క్షేత్రంలో కొలువైన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి గురువారం పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకుల పూజ అత్యంత వైభవోపేతంగా చేశారు. ప్రాతఃకాల సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థం అనంతరం స్వామి వారికి అభిషేక, అలంకరణ చేశారు. తదుపరి వేదపండితులు, అర్చకులు, ఉభయ దాతలు వేదస్వస్తి మంగళవాయిద్యంలతో ఆలయ ప్రదక్షిణ, వినాయక స్వామి, సుబ్రహ్మణ్య స్వామి జీవధ్వజ ఉష్ణవాహనానికి నారికేళఫల సమర్పణ, గణపతి పూజ చేశారు. ఋత్విక్వరుణ అనంతరం 11ఆవృత్తంలుగా దేవస్థానం వేదపండితులు, అర్చకులు పదివేల అరటిపండ్లతో పూజలు నిర్వహించారు. మహానివేదన, పంచహారతులు ఇచ్చారు. కార్యక్రమానికి ఉభయదాతలు గుంటూరుకు చెందిన శ్రీ న్యూ మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ యజమాని పొనకాల శ్రీనివాసరావు, అతని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

భారత గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై అన్ని శాఖల జిల్లా అధికారులతో గురువారం ఆయన తన చాంబర్లో సమీక్షించారు. జిల్లా అభివద్ధిని చాటి చెప్పేలా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని చెప్పారు. కలెక్టరేట్ ఆవరణలోని పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాటు చేసే కార్యక్రమాలు వేడుకగా నిర్వహించాలన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. సంప్రదాయాలు, దేశ భక్తి ప్రతిభంభించేలా సాంస్కతిక కార్యక్రమాలు ఉండాలన్నారు. స్టాల్స్, శకటాల ప్రదర్శన అత్యద్భుతంగా ఉండాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ పి వెంకటరమణ పాల్గొన్నారు.

ఆసరా కాదు. అక్కచెల్లెమ్మలకు టోకరా

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


ఎంఎల్ఎ ఏలూరి

వైసీపీ ప్రభుత్వ పాలనలో అక్కచెల్లెళ్లకు ఆసరా కరువై, టోకరానే మిగిలిందని ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి తప్ప అరాచకం, విధ్వంసమే కొనసాగుతుందని అన్నారు. నాడు అధికారం కోసం అక్కచెల్లెమ్మలకు ఆసరా కల్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పిన జగన్‌రెడ్డి నేడు అధికారంలోకి వచ్చాక ఆచరణలో మహిళలను నిట్టనిలువునా మోసం చేస్తున్నాడని ఆరోపించారు. జీతాలు పెంచమని వేడుకున్న అంగన్‌వాడీలపై కక్షకట్టి ఉక్కుపాదం మోపిన జగన్‌రెడ్డి ఆసరా కింద మహిళలను ఉద్ధరిస్తాననడం సిగ్గుమాలిన చర్య కాదాని ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో దినదిన ప్రవర్ధమానంగా వెలిగిన డ్వాక్రా వ్యవస్థను కూకటివేళ్లతో పెకలిస్తున్న జగన్‌రెడ్డి ఆసరా పేరుతో తానేదో పొదుపు సంఘాలను ఉద్ధరించేస్తున్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో కోటీ 14లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే 79లక్షల మందికే అసరా అంటూ సకాలంలో డ్వాక్రా రుణాలు చెల్లించిన 75శాతం మందికి టోకరా వేయడం మోసం చేయడం కాదాని ప్రశ్నించారు. చంద్రన్న హయాంలో పొదుపు మహిళలకు సున్నా వడ్డీ రూ.5లక్షల వరకు వర్తింపజేశారని, జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే రూ.10లక్షలకు పెంచుతానని నమ్మించి తీరా అధికారంలోకి రాగానే రూ.3లక్షలకు కుదించడం మహిళలను మోసం చేయడం కాదా అన్నారు. రూ.3లక్షలకు కూడా సున్నా వడ్డీ కేంద్రమే భరిస్తోంది తప్ప జగన్‌రెడ్డి ఇచ్చిందేంటని అన్నారు. వృద్ధాప్యంలో ఆదుకుంటాయని డ్వాక్రా మహిళలు దాచుకున్న రూ.2,118కోట్ల అభయహస్తం నిధులు దారి మళ్లించడమే మహిళా సంక్షేమమా అన్నారు. ఉన్నతి పథకంతో ఎస్సీ, ఎస్టీ మహిళలకు చంద్రబాబు రూ.800 కోట్లిస్తే జగన్‌రెడ్డి పథకాన్ని రద్దు చేశాడన్నారు. 45ఏళ్లకే పెన్షన్ పేరుతో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నాలుక మడతేసి చేయూత అంటూ దగా చేశాడని, రూ.1.80లక్షలు అందాల్సిన సాయానికి గండ కొట్టాడన్నారు. టిడిపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు


ఎంఎం కొండయ్య

ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీని పక్కాగా అమలు చేసిందన్నారు. 85లక్షల డ్వాక్రా మహిళలకు మూడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.8,500 కోట్ల రుణాలు మాఫీ చేశామన్నారు. అందరికీ సమన్యాయం చేయాలనే లక్ష్యంతో పసుపు కుంకుమ పేరుతో 2018-19లో రూ.10వేల కోట్లు చెల్లించారని అన్నారు. వడ్డీ రాయితీ కింద రూ.2,514 కోట్లు చెల్లించామని అన్నారు. అయినా టీడీపీ రుణమాఫీ చేయలేదంటూ జగన్ రెడ్డి ప్రచారం చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మహిళలు సాగిస్తున్న ప్రగతి పథానికి టిడిపి ప్రభుత్వం వేసిన పునాదులే కారణం అన్నారు. డ్వాక్రా వ్యవస్థ ఏర్పాటుతో మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే కాకుండా ఎప్పుడూ ఎవరూ ఊహించని విధంగా అంతర్జాతీయ వేదికలపై మహిళల్ని నిలబెట్టిన ఘనత చంద్రబాబుదే అన్నారు. బాలింతలకు రూ.5వేలు నిలిపివేశాడని అన్నారు. అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, గోపాల మిత్రలు రద్దు, కల్యాణమిత్ర, బీమామిత్ర, పశుమిత్రలుగా పనిచేస్తున్న7000 మందికిపైగా సిబ్బందిని విధుల నుంచి తొలగించారాన్నరు. గంజాయి, మాదక ద్రవ్యాలకు అడ్డాగా ఏపీని మార్చారని, అత్యాచారాలకు కేరాఫ్ అడ్రస్‌గా రాష్ట్రం మారిందని ఆరోపించారు.

చీరాల : ఆసరా పేరుతో జగన్‌రెడ్డి ప్రజలకు టోకరా పెడుతున్నారని టిడిపి ఇంచార్జ్ మద్దులూరి మాల కొండయ్య ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. టిడిపి కార్యకర్తలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా రుణమాఫీ, పసుపు కుంకుమ ద్వారా చంద్రన్న పాలనలో కోటిమంది మహిళలు ఒక్కొక్కరు సమానంగా రూ.20వేలు లబ్ధిపొందారని అన్నారు. మద్యం రేట్లు మూడు రెట్లు పెంచి రూ.2లక్షల కోట్ల విలువైన నాశిరకం మద్యం అమ్మారన్నారు. నాశిరకం మద్యం తాగి కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోయిన మహిళలలు రోడ్డున పడ్డారని అన్నారు. జగన్ ఇచ్చేది గోరంత - దోచేది కొండంతని అన్నారు.

మధ్యంతరంగా ముగిసిన పాదయాత్ర

ప్రజాశక్తి - వేటపాలెం


ఓపెన్‌టాప్ కారుపై ఆమంచి స్వాములు

జనసేన ఇన్ ఛార్జి ఆమంచి శ్రీనివాసరావు (స్వాములు) మహా పాద యాత్ర పేరుతో గురువారం చేపట్టిన పాదయాత్ర మధ్యలోనే ముగించారు. పందిళ్ళపల్లిలోని తన ఇంటి నుండి దేశాయిపేట జనసేన కార్యాలయం వరకు పాదయాత్ర ఉంటుందని ప్రకటించారు. ప్రజల సమస్యలు తెలుసుకునే విధంగా కొనసాగుతుందని చెప్పారు. అయితే అలాంటివి ఏమీ లేకుండానే పందిళ్లపల్లి నుండి వేటపాలెం గడియార స్తంభం సెంటర్ వరకు కొనసాగింది. వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు అనంతరం ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్షులు షేక్ రియాజ్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న సమయంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పి ఓపెన్ టాప్ కారులో దేశాయిపేట జనసేన కార్యాలయం వరకు ప్రజలకు అభివాదం చేస్తూ కొనసాగింది. పాదయాత్రకు ఎలాంటి అనుమతి లేదని, ముందస్తుగా 30యాక్ట్ అమలులో ఉన్నట్లు వేటపాలెం పోలీసులు ఆయనకు నోటీసులు ఇచ్చారు.


కమిషనర్‌కు ప్రశంసా పత్రం ఇస్తున్న కలెక్టర్ రంజిత్‌బాష

రామచంద్రారెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ కమిషనర్ కె రామచంద్రారెడ్డి సేవలు అభినందనీయమని కలెక్టర్ పి రంజిత్ భాషా అన్నారు. భారత ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు చీరాల అసెంబ్లీ నియోజక వర్గంనకు ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారి అవార్డు, ప్రశంసా పత్రంను కలెక్టరు పి రంజిత్ భాషా చేతుల మీదుగ అందుకున్నారు. ఓటర్ల జాబితా రూపొందించడంలో చీరాల పట్టణంలో కృషి బాగుందని తెలిపారు. రాజకీయ పార్టీలను సమన్వయం చేసుకుని జాబితాను సకాలంలో పూర్తి చేశారని, కొత్త ఓటర్ల చేర్పుల్లో అవగాహన కల్పించారని ప్రశంశించారు. అన్ని నియోజకవర్గాల్లో అలాంటి కృషి జరగాలన్నారు.

బుల్లెట్ కంటే బ్యాలెట్ గొప్పది..


ఓటర్ల దినోత్సవం సభలో కలెక్టర్ రంజిత్ బాషా

కలెక్టర్ పి రంజిత్ బాషా

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు బుల్లెట్ కంటే శక్తి కలిగినదని కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. 14వ ఓటర్ల దినోత్సవం ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. భారత ఎన్నికల కమిషన్ ఆవిర్భవించిన సందర్భంగా వేదికపై ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. దశాబ్దాలుగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న వద్ధులైన ఓటర్లు, విభిన్న ప్రతిభావంతులైన ఓటర్లు, ఇతరుల (హిజ్రాలు)కు శాలువలు కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల తుది జాబితా విడుదలకు విశేషంగా కషి చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నూతన ఓటర్ల నమోదుకు సహకరించిన కళాశాలల ప్రధానాచార్యులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువతీ, యువకులకు ఓటు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకుంటామని సభికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటర్ల జాబితా సవరించి ఈనెల 22న తుది జాబితా విడుదల చేశామన్నారు. 18ఏళ్లు దాటిన 15వేల మంది పౌరులకు నూతనంగా ఓటు హక్కు కల్పించినట్లు తెలిపారు. 86శాతం తమ ఓటు హక్కు వినియోగించుకోవడంలో బాపట్ల జిల్లాలోని 6అసెంబ్లీ నియోజకవర్గాలు రాష్ట్రంలో ప్రథమ స్థాయిలో నిలిచాయన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రెండు నెలల నుంచి ప్రజల్లో విస్తతమైన అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని 1,510 పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంప్ వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. ఎన్నికలు నిర్వహించడానికి ఈవీఎం యంత్రాలు సిద్ధంగా ఉంచామన్నారు. ఓటు ఆవశ్యకత, గొప్పతనాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని అదనపు ఎస్పీ పి మహేష్ అన్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, డిఆర్‌ఒ వెంకటరమణ, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఒలు జి రవీందర్, పి సరోజిని, హేలా షారోన్, వ్యవసాయ కళాశాల డీన్, ప్రధానాచార్యులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొండపి : ప్రజలను పాలించే సమర్థవంతమైన నాయకుడుని ఎన్నుకొనేది ఒక్క ఓటేనని తహశీల్దారు పి శింగరావు అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా తహశీల్దారు కార్యాలయం నుంచి గాంధీబొమ్మ సెంటర్ మీదుగా ఎన్టీఆర్ కూడలి వరకు విద్యార్థుల చేత ర్యాలి నిర్వహించి నినాదాలు చేశారు. ఎన్టిఆర్ కూడలిలో మానవ హారం, విద్యార్థుల చేత అధికారులు కలిసి ఓటర్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణమూర్తి పాల్గొన్నారు. స్థానిక గ్రంథాయంలో జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలు గ్రంథపాలకుడు బి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠకుల చేత ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బాబురావు, పెరిదేపి మాజి సర్పంచ్ గుమ్మళ్ళ వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శింగరాయకొండ : తహశీల్దార్ కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి జాయింట్ కలెక్టర్ నారధముని హాజరయ్యారు. ఓటర్ల దినోత్సవ ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ ఉష, డిప్యూటీ తహశీల్దార్ తన్నీరు వెంకటేశ్వర్లు, ఎంఇఒ బి శివనారాయణ, ఆవుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : మండలంలోని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి విద్యార్థులు, పాఠశాల సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం అనంతరం 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం ఏర్పడిందన్నారు. దశాబ్దాలు గడుస్తున్నా ఓటు హక్కు నమోదు నిర్లిప్తంగా ఉండటంతో 2011లో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ కేంద్ర మంత్రివర్గం సమావేశంలో ఓటర్ల దినోత్సవం ఆమోదించిందని గుర్తు చేశారు. ఎన్నికల సంఘం ఆవిర్భవించిన రోజు జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం జరపాలని నిర్ణయించారన్నారు. రాజ్యాంగం యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పిస్తుందన్నారు. ప్రతి పౌరుడు 18ఏళ్ల తరువాత తమ ఓటును నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్యం మనుగడ సాగాలంటే ఓటు కీలకం అన్నారు. ప్రతి ఏటా వచ్చే పండుగలు ఇంట్లో సందడి చేసినట్లే ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఓట్లు పండగ ప్రజాస్వామ్యానికి పండగ రోజు అన్నారు. ప్రతిపౌరుడు ఓట్ల పండుగను బాధ్యతగా జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పర్వతనేని పావని, భవనం శివలీల, పెంట్యాల పావని, బండారు అనిల్ కుమార్, అంబటి సురేష్, వసంత రఘు బాబు, సిహెచ్ శ్రీవిద్య లక్ష్మి, పెండ్యాల రాధిక, గోబిదేశి ఆదినారాయణ, వరికల్లు బ్రహ్మయ్య, గోరంట్ల సంధ్యారాణి, అంబటి అపర్ణ, కంభంపాటి నరసయ్య పాల్గొన్నారు.

రేపల్లె : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని, వ్యక్తి అస్తిత్వాన్ని నిల బెడుతూ, వ్యవస్థ మార్పుకు నాంది


ఓటు హక్కుపై రేపల్లెలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహశీల్దారు

పలుకుతుందని తహశీల్దారు మల్లికార్జునరావు అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటర్ల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతుందన్నారు. ఓటు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నేడు ఓటు ఒక సరుకుగా, ఎన్నికల వ్యవస్థ ఒక మార్కెట్‌గా మారిందని అన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురి కావడమే దీనికి కారణం అన్నారు. డబ్బు, మద్యం తోపాటు రకరకాల కానుకలతో రాజకీయ నాయకులు ఓటర్లకు వలవేయటం పరిపాటిగా మారిందన్నారు. దీంతో 75ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో ఇప్పటికీ ప్రజల జీవన ప్రమాణాలు ఆశించిన స్థాయిలో పెరగలేదన్నారు. నేటికీ పేదరికం, దారిద్ర్యం, నిరుద్యోగం, నిరక్షరాస్యతలో ఉన్నారని తెలిపారు. ప్రజల్లో కులతత్వం, మతతత్వం వంటి సంకుచిత భావ జాలాలు పెరగటానికి ప్రధాన కారణం ఓటు దుర్వినియో గమే అన్నారు. భారతరాజ్యాంగం సార్వత్రిక వయోజన ఓటు హక్కును 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తికి కల్పించి ప్రజాస్వామ్యంలో భాగం చేసిందన్నారు. ఓటు హక్కుపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారధి పాల్గొన్నారు.

పర్చూరు : అందరూ ఓటు హక్కుని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు సంధ్య శ్రీ అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జూనియర్ కళాశాల విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఓటర్లు అందరికి అవగాహన కల్పించారు. బొమ్మల సెంటర్లో అందరి చేత ప్రమాణం చేయించారు. ఓటు చాలా విలువైనదని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిటి ఎం సత్యనారాయణ, ఆర్ఐ ప్రేమ్ కుమార్, విఆర్ఒలు, విద్యార్థులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఐలవరం, వెల్లటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలతో పాటు భట్టిప్రోలు ఉన్నత పాఠశాల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వెల్లటూరులో ఓటు హక్కు, దాని వినియోగంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు కర్ర అరుణకుమారి, మాచర్ల మోహనరావు, సి రామ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్, శివరామకృష్ణ పాల్గొన్నారు.


కొండేపిలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ


భట్టిప్రోలులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్



పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న తహశీల్దారు సంధ్యశ్రీ

దేవాంగులకు ప్రధాన పార్టీలు సీటివ్వాలి

సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - వేటపాలెం

దేవాంగులకు చీరాల నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు సీటు కేటాయించాలని, అలా అవకాశం ఇచ్చిన పార్టీకి మద్దతుగా నిలబడి గెలిపించుకుంటామని దేవాంగ ప్రతినిధుల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు దేవాంగ ప్రతినిధులు తెలిపారు. కులం, రాజకీయ ప్రాధాన్యత అంశంపై మండలంలోని దేశాయిపేటలోని చల్లా రామయ్య, కోట సుబ్బమ్మ కళ్యాణ మండపంలో దేవాంగ ప్రతినిధులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో దేవాంగులకు ప్రాతినిధ్యం అవకాశం కల్పిస్తే రాజకీయాలకు అతీతంగా దేవాంగ అభ్యర్థిని గెలిపించుకునేందుకు ఐక్యం కావాలని



దేవాంగ సమావేశంలో మాట్లాడుతున్న సజ్జ వెంకటేశ్వరరావు

చేనేత జన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మాచర్ల మోహనరావు కోరారు. టిడిపి సీనియర్ నాయకులు సజ్జ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ సజ్జా చంద్రమౌళి తరువాత చీరాల రాజకీయాల్లో దేవాంగులకు అవకాశం ఇవ్వలేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో దేవాంగులకు అవకాశం కల్పిస్తే అందరూ ఐక్యంగా గెలిపించుకుంటామని అన్నారు. దేవాంగ కార్పొరేషన్ ఛైర్మన్ సురేంద్ర మాట్లాడుతూ రాజకీయ ప్రాధాన్యత లేని కులాలు సమాజంలో అభివృద్ధికి నోచుకోలేవని అన్నారు. రాజకీయం అభివృద్ధికి కలిసి పనిచేయాలని కోరారు. మాజీ ఎంపీపీ చల్లా జనార్ధనరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు దేవాంగులకు అవకాశం ఇస్తే అందరం కలిసి ఆర్థికంగా అభ్యర్థికి అండగా ఉండి గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో దేవల మనుబ్రహ్మ దేవాంగ సంఘం, బాపట్ల జిల్లా దేవాంగ సంఘం, శ్రీ జ్యోతిర్మయి దేవాంగ సమితి అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, జెడ్‌పిటిసి బండ్ల తిరుమలదేవి, గ్రామ సేనాధిపతులు, దేవాంగ కుల పెద్దలు, యువత పాల్గొన్నారు.


జనరిక్ మందులు పరిశీలిస్తున్న కెవి రామారావు

జనరిక్ షాపు ప్రారంభం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపును జిల్లా సహకార అధికారి కెవి రామారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పిఎసిఎస్ చైర్‌పర్సన్ గుమ్మడి సాంబశివరావు అధ్యక్షత వహించారు. ప్రధానమంత్రి ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జనరిక్ మందుల షాపు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మందులు ఈ షాపులో సరసమైన ధరలకు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ మరక రవికుమార్, డైరెక్టర్ కుక్కల వీర రాఘవయ్య, జిడిసిసి బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ ఎస్ అరుణ, సూపర్వైజర్ డివిజన్ ప్రసాద్, సొసైటి సీఈఒ వేములపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న వల్లభనేని సుబ్బయ్యచౌదరి

ప్రథమ బహుమతి అందజేత

ప్రజాశక్తి - నగరం

ముప్పాళ్లలోని ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఈనెల 23న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ మెన్ టోర్నమెంట్లో స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. 24న కాజీపాలెంలోని కెవిఆర్ %డ% ఎంకెఆర్ కాలేజ్లో నిర్వహించిన క్రాస్ కంట్రీ 10కెఎం రన్నింగ్ ఈవెంట్లో విద్యార్థులు ద్వితీయ బహుమతి, విద్యార్థినులు తృతీయ బహుమతి సాధించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు క్రీడల్లో అద్వితీయ ప్రతిభ కనబరిచారని అభినందించారు. ప్రత్యేక బహుమతులతో సత్కరించారు. విద్యార్థులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఆరుగురు విద్యార్థులు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ ఆటల ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని అన్నారు. క్రీడాకారులను ఎప్పుడు కళాశాల ప్రోత్సహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మాగంటి సుధాకరరావు, కళాశాల సూపరింటెండెంట్ పి అమరేష్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ వి సాంబ మూర్తి పాల్గొన్నారు.

నేడు టిడిపి సమావేశం

ప్రజాశక్తి - కొండపి

టిడిపి మండల విస్తృత స్థాయి సమావేశం నేడు అనగా 26న శుక్రవారం జరుగుతుందని టిడిపి మండల అధ్యక్షులు బి యలమందనాయుడు తెలిపారు. కొండపిలోని పొదిలి రోడ్డులో గుడిపల్లి చందు కళ్యాణ మండపం నందు ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలిపారు. సమావేశానికి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య హాజరవుతారని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల టిడిపి నాయకులు, వివిధ స్థాయిల్లో ఉన్న అనుబంధ కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

రహదారి భద్రతా నియమాలు పాటించండి

నాక్థాన్ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కలెక్టర్ ఏఎస్. దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. 'రోడ్డు భద్రతా మాసోత్సవాలు'లో భాగంగా గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి అద్దంకి బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించిన 'నాక్థాన్ ర్యాలీ'ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలలో రహదారుల భద్రతపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా జనవరి 20 నుంచి ఫిబ్రవరి 19 తేదీ వరకు రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిలో భాగంగా పలు అవగాహనా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రజలు రహదారి నిబంధనలపై అవగాహన ఉండాలన్నారు. రహదారులపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఏడాదితో పోల్చితే జిల్లాలో రహదారులపై ప్రమాద మరణాలు 15 శాతం, క్షతగాత్రులు 30 శాతం తగ్గుదల నమోదైందన్నారు. ప్రమాదాలు ఎక్కువగా మద్యం తాగి వాహనాలు నడపడం, అధిక వేగంతో జరుగుతున్నాయన్నారు. వాటిని నివారించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జరిగిన ప్రతి ప్రమాదాన్నీ ఫోటోలు తీసి ఐర్యాడ్ యాప్‌లో నమోదు చేసి ప్రమాదానికి ఉన్న కారణాలపై విశ్లేషించి, ఆర్ అండ్ బి, పోలీసు శాఖలు సమన్వయంతో అదే ప్రాంతంలో మళ్ళీ ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టరు శౌర్యమన్ పటేల్, ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్ నాయక్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి


ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాజ్యాంగం ప్రసాదించిన హక్కును, తమపై ఉన్న బాధ్యతను ఓటర్లందరూ గుర్తించి తప్పనిసరిగా ఓటు వేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. భారతి పిలుపునిచ్చారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ప్రకాశం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత డి.ఆర్.ఆర్.ఎం. స్కూల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి భారీ బెలూన్‌ను కలెక్టర్ ఎగురవేశారు. అనంతరం ఓటు ప్రాధాన్యాన్ని తెలియజేసేలా ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన నాలుగు ప్రత్యేక స్టాల్స్‌ను కలెక్టర్‌తో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఇతర ప్రముఖులు వీక్షించి సెల్ఫీ పాయింట్‌లో ఫోటో దిగారు. అనంతరం జరిగిన సభలో జిల్లా జడ్జి మాట్లాడుతూ బుల్లెట్ కంటే బ్యాలెట్ అత్యంత శక్తిమంతమైందని, ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలను తెలుసుకుని సమర్థులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఏ పార్టీతోనూ, ఏ ప్రభుత్వంతోనూ సంబంధం లేకుండా పని చేస్తున్న అత్యంత విశ్వసనీయ సంస్థగా భారత ఎన్నికల సంఘానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. 80 ఏళ్లు పైబడిన వారి కోసం, వికలాంగ ఓటర్ల కోసం వారి ఇంటికే వెళ్లి అధికారులు ఓటు సేకరించేలా ఈసారి ప్రత్యేక అవకాశం కల్పించిందన్నారు. ఓటర్లందరూ తమ హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పట్టణ ప్రాంత ఓటర్లు మరింతగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, ఏఎస్పి కె.నాగేశ్వరరావు, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిఆర్ఓ ఆర్.శ్రీలత, డిఆర్‌డిఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ టి.రవికుమార్, స్వీప్ కార్యక్రమ నోడల్ ఆఫీసర్ రవి, ఒంగోలు మున్సిపల్ కమిషర్ ఎం.వెంకటేశ్వరరావు, ఒంగోలు తహశీల్దార్ మురళి, ఏ.ఎల్.ఎస్. కో-ఆర్డినేటర్ వి.సుబ్బారావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో అపశృతి

మంత్రి మేరుగు నాగార్జునకు స్వల్పగాయాలు

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో గురువారం జరిగిన 'ఆడుదాం ఆంధ్రా'లో అపశృతి చోటుచేసుకుంది. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభానికి ఇన్‌ఛార్జి మంత్రి మేరుగు నాగార్జున ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన కబడ్డీ ఆడుతుండగా.. పొరపాటున కిందపడ్డారు. దీంతో ఆయన చేతికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఒంగోలు వెళ్లారు.

జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 10 మంది ఆఫీస్ సబార్డినేట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఇస్తూ కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం స్పందన హాలులో వారికి నియామక పత్రాలను అందించారు. మరింత బాధ్యతగా విధులు నిర్వహించి భవిష్యత్తులో మెరుగైన స్థాయికి చేరాలని వారికి కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిఆర్ఓ ఆర్. శ్రీలత, కలెక్టరేట్ ఏఓ కె. చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బూచేపల్లి ఎన్నికల ప్రచార ప్రారంభ కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలు, ర్యాలీలో పాల్గొన్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆయన కుటుంబం

'బూచేపల్లి' ఎన్నికల ప్రచారం ప్రారంభం

మోటారు సైకిళ్లతో భారీ ర్యాలీ


వైఎస్ఆర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-దర్శి

నియోజకవర్గంలో ఉన్నది ఒకే ఒక వర్గమని.. అదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వర్గమని దర్శి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా మండలంలోని రాజంపల్లి గుడిలో జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి సతీమణి నందిని కుమార్తె, కుమారుడితో కలిసి శివప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. దర్శి గడియారస్తంభం సెంటర్‌కు ర్యాలీ సాగింది. అక్కడ ప్రజలనుద్దేశించి బూచేపల్లి మాట్లాడుతూ దర్శి ప్రజలకు సేవ చేసేందుకు బూచేపల్లి కుటుంబం ఉంటుందన్నారు. కులానికో, వర్గానికో బూచేపల్లి కుటుంబం పరిమితం కాదని, అన్ని కులాలు, అన్ని వర్గాల వారిని కలుపుకొని పోవడమే తమ ధ్యేయమన్నారు. జిల్లాపరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఛైర్‌పర్సన్‌గా తమకు అవకాశం ఇచ్చారని, జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటామని అన్నారు. దర్శిపై మరోసారి పోటీ చేయబోతున్న శివప్రసాద్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాజంపల్లిలో ఎస్సీ కాలనీలో రోడ్డుకు శంకుస్థాపన చేసిన బూచేపల్లి అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం పులిపాడు వద్ద కీసరి శ్రీనివాసరెడ్డి వెంచర్లలో వచ్చిన వారందరికీ భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచార శంఖారావానికి బూచేపల్లి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి, తూము వెంకట సుబ్బారెడ్డి, స్టేట్ కార్పొరేషన్ డైరక్టర్లు ఎస్ఎం భాషా, కుమ్మిత అంజిరెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్లు కేవీ రెడ్డి, మాజీ ఎంపీపీలు ఇత్తడి దేవదానం, పోశం మధుసూదన్‌రెడ్డి, కోట రామిరెడ్డి, వీరగంధం కోటయ్య, మోసే, జేసీఎస్ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బూచేపల్లి అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేడు 'గణతంత్ర' వేడుకలు

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో దేశ 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లా స్థాయి వేడుకలు జరిగే పోలీసు పరేడ్ గ్రౌండ్లో ఏర్పాట్లను కలెక్టర్ దినేష్ కుమార్, జిల్లా ఎస్‌పి మలిక గర్గ్ తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 75వ గణతంత్ర దిన వేడుకలు విజయవంతంగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌పి మలిక గర్గ్ మాటాడుతూ ఈ వేడుకలకు అతిథులు, ప్రముఖులు, విద్యార్థులు హాజరవుతుండటంతో అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వాహనాల పార్కింగ్ వంటి అంశాలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్, ఎస్పీ వెంట డిఆర్ఓ ఆర్.శ్రీలత, ఒంగోలు ఆర్డిఓ వి.విశ్వేశ్వరరావు ఉన్నారు.

రెవెన్యూ రికార్డ్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం భవనంలో కొత్తగా నిర్మించిన రెవెన్యూ రికార్డు భవనాన్ని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ గురువారం ప్రారంభించారు. రూ.15 లక్షల వ్యయంతో ఆరు నెలల కాలంలో 1800 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ రికార్డు భవన నిర్వహణకు సంబంధించిన పలు సూచనలను ఈ సందర్భంగా కలెక్టర్ చేశారు. అనంతరం ప్రకాశం భవనం మొదటి అంతస్తులో సి, డి సెక్షన్లకు కోసం ఆధునీకరించిన గదిని కూడా కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఆర్. శ్రీలత, ట్రైనీ కలెక్టర్ శైర్యమన్ పటేల్, ఏపిఈడబ్ల్యుఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. భాస్కర్ బాబు, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగనన్న పంపిన సైనికుడిని మాత్రమే..

మంత్రి సురేష్


మంత్రి సురేష్

ప్రజాశక్తి-టంగుటూరు

తాను రాష్ట్ర మంత్రిగానో, మరే ఇతర పెద్ద పదవులతోనే ఇక్కడకి రాలేదని, కేవలం జగనన్న పంపిన సైనికుడిగా, కార్యకర్తగా మాత్రమే వచ్చానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ వ్యాఖ్యానించారు. గురువారం స్థానిక కొండపి రోడ్డులోని కళ్యాణమండపంలో టంగుటూరు మండల వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి సురేష్ మాట్లాడుతూ టంగుటూరు మండలంలోని ప్రతి గ్రామంపై తనకు అవగాహన ఉందని, వైసిపి కుటుంబ సభ్యులను దగ్గరగా కలుసుకొని వారితో మాట్లాడి ఆ గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొండపి నియోజకవర్గంలో ఈ దఫా వర్గ విభేదాలు లేకుండా అందరం కలిసికట్టుగా ముందుకు సాగి వైసిపి జెండాను ఎగరేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు మల్లవరపు రాఘవరెడ్డి, మండల జెసిఎస్ కన్వీ నర్ చింతపల్లి హరిబాబు, జడ్పిటిసి మన్నం అరుణకుమారి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.